

గట్టు.. మిగిలితే ఒట్టు

గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ గట్టు రోజురోజుకూ తరిగిపోతోంది. నేడు నేలకు సమాంతరంగా అయ్యింది. వివరాలు 8లో ▸



రైతు సేంద్రియ సాగు చేయాలి

ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్ సూచించారు. వివరాలు 8లో ▸



కృత్రిమ గర్భధారణ చేయించాలి

మేలుజాతి పశువులకోసం కృత్రిమ గర్భధారణ చేయించాలని మండల పశువైద్యాధికారి రాజు తెలిపారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే జోలికొస్తే ఊరుకోం

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్



మాట్లాడుతున్న గోవర్ధన్

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జోలికొస్తే చూస్తూ ఊరుకునేదిలేదని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ హెచ్చరించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాజేష్, రాజాసింగ్‌లతో కలిసి మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌పై బీజేపీ నాయకుడు పంజా విజయ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలన్నారు. ఇదే తీరులో మాట్లాడితే గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో పేదలకు, రైతులకు ఎన్నో మేలు జరిగే కార్యక్రమాలు చేశారని. అవి చూసి ఓర్వలేకనే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు సుధాకర్, చందు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను త్వరగా చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ త్వరగా చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న పిలుపుమేరకు మంగళవారం మండలంలోని రంగంపేట తహసీల్దార్ కార్యాలయం వరకు సైకిల్ యాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ముఖ్యమంత్రి నిండు అసెంబ్లీలో స్వాగతించాలని గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్ర వర్గీకరణ చేపట్టక ముందే తాము చేపడతామమన్నారు. ఆ దిశగా ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈనెల 19న హైదరాబాదులో మాదిగల మహాగర్జన ఉంటుందని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్‌కు ఐదు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సంజీవయ్య, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు రమేష్, నాయకులు యోహాన్, మల్లేశ్, కృష్ణ, నవీన్, సత్యం పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులను చూపిస్తా

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): పట్నం విడిచి పల్లెలకు వస్తే రుణమాఫీ కాని రైతులను చూపిస్తానని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు సవాల్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షల లోన్ రుణమాఫీని వంద శాతం చేశామని చెప్తున్న మంత్రి పల్లెలకు వస్తే అర్హులై ఉండి, మాఫీ పొందని రైతులను చూపిస్తానని చెప్పారు. మెదక్ నియోజకవర్గంలోని పలు సొసైటీల పరిధిలో 100 శాతం రుణమాఫీ కాలేదన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల పైగా ఉన్న రుణాల సంగతేంటని ప్రశ్నించారు. రైతుబంధును ఏడాదికి రూ.15 వేలు వెంటనే చెల్లించాలని కోరారు.

6న గౌడ జనుల హక్కుల పోరాట సమితి సమావేశం

పాపన్నపేట(మెదక్): కొడిపల్లిలో ఈ నెల 6న గౌడ జనుల హక్కుల పోరాట సమితి సమావేశం జరుగుతుందని పాపన్నపేట మండల గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ తెలిపారు. రేణుకాఎల్లమ్మ ఆలయంలో జరిగే సమావేశంలో గౌడ జనుల సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరువుతున్నందున గౌడ కులస్తు లు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

స్నిఫర్ డాగ్స్ తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి, బేగంపేట గ్రామాల్లో బెజ్జంకి పోలీసులు మంగళవారం స్నిఫర్ డాగ్స్‌తో ముమ్మర తనిఖీ చేపట్టారు. గంజాయి, గుట్కా, మత్తుపదార్థాల ఆచూకీ కోసం కిరాణా, పాన్‌షాప్‌లతో పాటు అనుమానిత స్థలాల్లోను తనిఖీ నిర్వహించారు.

శాశ్వత పథకాలపై దృష్టి

విద్య, వైద్యా రంగానికి పెద్దపీట

- ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు
- తండాలకు రహదారులు
- చార్మినార్ జోన్ హామీ ఏమైంది..?
- కాంగ్రెస్‌ది 'గ్యారెంటీ'లేని పాలన
- మాటలెక్కువ.. చేతలు తక్కువ
- హామీల అమలులో పూర్తిగా వైఫల్యం
- ఎమ్మెల్యే వాకిటి సునీతారెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతోంది. ఇప్పటివరకు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు చూపిన అభివృద్ధి, నియోజకవర్గాలను పట్టిపీడిస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు, నియోజిక వర్గ అభివృద్ధికి వారి దగ్గరున్న ప్రణాళికలేంటి వంటి అంశాలపై 'సాక్షి'ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో ముచ్చటించింది. నర్సాపూర్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గంలో తన పట్టు సాధించిన సునీతారెడ్డి నియోజకవర్గంలో చేసిన పనులు, భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రగతి ప్రణాళికపై ఆమె 'సాక్షి'తో పంచుకున్నారు. నర్సాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఉద్ఘాటించారు.



నర్సాపూర్

నియోజకవర్గంలో శాశ్వత పథకాల అమలుపై దృష్టి సారించానని, వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతారెడ్డి చెప్పారు. ఎమ్మెల్యేగా ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై.. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న పీజీ కళాశాలకు పక్కా భవనాలు, పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు, గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణాలను చేపట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే.. గిరిజన తండాలకు రహదారుల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. నర్సాపూర్ డివిజన్ కేంద్రంలో ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఇప్పటికే మంత్రుల దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. వాటిని ఏర్పాటు చేయడంతో పాటు ఆర్డీఓ, తహసీల్దార్ తదితర మండల స్థాయి కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మిస్తామని, కొత్తగా ఏర్పడిన మాసాయిపేట, చిలిపిచెడ్ మండల కేంద్రాలలో ఆయా శాఖల కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వివరించారు.

నేను ప్రజల మనిషిని..

తాను ప్రజల మనిషి అని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఎప్పుడూ ప్రజల మధ్యలో ఉంటానని, ఇక ముందు కూడా వారికి అందుబాటులో ఉంటానని ఉద్ఘాటించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తానని, అంతిమంగా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు.

మాటలకు చేతలకు పొంతన ఏదీ?

రైతులు, మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని సునీతారెడ్డి విమర్శించారు. రుణమాఫీ పథకం అమలులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల మాటలకు, చేతలకు పొంతన లేదని ఆమె దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలకు ఏసీడీఎఫ్ పథకం కింద రూ. ఐదు కోట్లు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో కేటాయించినా, నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. చిన్న చిన్న పనులకు సైతం నిధులు కేటాయించలేని పరిస్థితి ఎమ్మెల్యేలదని ఆమె విచారం వ్యక్తం చేశారు.

ఏం సాధించారని విజయోత్సవాలు

కాగా ఏడాది పాలనలో ఏమి సాధించారని విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కనీసం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు అమలు చేయలేదన్నారు. ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని సునీతారెడ్డి అన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ది అవగాహన లేని పరిపాలన



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేని పరిపాలన కొనసాగిస్తోందని సునీతారెడ్డి విమర్శించారు. ఎన్నికలప్పుడు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చారని, వాటిని అధికారంలోకి రాగానే తుంగల్లో తొక్కారన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీల అమలు చేయకుండా విఫలం చెందారని ఆమె విమర్శించారు. మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి తొలగించి, చార్మినార్ జోన్‌లో కలుపుతానని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ సభలో సీఎం హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి రావాలన్న ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఇష్టానుసారంగా హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన గురించి గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- విపక్షాల విమర్శలు దురదృష్టకరం
- పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్‌రూరల్: అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, ప్రజా పాలన విజయోత్సవాల సమన్వయకర్త జూలకంటి ఆంజనేయులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఇతర నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా ఈ నెల 9వరకు ప్రజా పాలన విజయోత్సవాల పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ స్థాయిలో చేపట్టవలసిన ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలపై నాయకులకు సూచనలు చేశారు. 7వ తేదీన మండల స్థాయిలోను, 9వ తేదీన సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకొని ముగింపు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్, నగేశ్, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కృపాచారి, రాధాకిషన్ గౌడ్, అశోక్, సుధీర్ గౌడ్ పాల్గొన్నారు.

6 గ్యారెంటీలు.. 66 మోసాలు

కాంగ్రెస్ పాలనపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ధ్వజం

నర్సాపూర్: అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై మంగళవారం నర్సాపూర్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా 66 మోసాలు చేస్తోందన్నారు. ఎన్నికలప్పుడు రేవంత్ రెడ్డి మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలుపుతానని, నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్‌లో రోహిత్‌రావు అధికార ఎమ్మెల్యేగా ఉండగా.. కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు అనధికార ఎమ్మెల్యేగా, నర్సాపూర్‌లో సునీతారెడ్డి అధికార ఎమ్మెల్యేగా ఉండగా కాంగ్రెస్ నాయకుడు ఆవుల రాజిరెడ్డి అనధికార ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్టు కోసం అప్పు చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నది కోసం అప్పు చేస్తోందన్నారు. ఆ రెండు పార్టీలు ఒకే కోవకు చెందినవని, వాటితో పేదలకు ఒరిగేదేమి లేదని చెప్పారు. సమావేశానికి ముందు బైక్ ర్యాలీ చేపట్టి ఫంక్షన్‌హాలుకు చేరుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, రఘువీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడు సురేశ్, రమణారావు, మల్లేష్‌గౌడ్, నగేష్, బుచ్చేష్‌యాదవ్, కవితారెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, నగేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

కలగానే పేదోడికి కార్పొరేట్ వైద్యం

రామాయంపేట(మెదక్): పేదవారికి కార్పొరేట్ వైద్యం అందాలన్న యోచన కలగానే మిగిలిపోయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ ఆరోపించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ తదితరులతో కలసి మంగళవారం ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా లాయన మాట్లాడుతూ.. రామాయంపేట ప్రభుత్వాస్పత్రిని రెండేళ్ల క్రితం వైద్య విధాన పరిషత్ పరిధిలో చేర్చినా ఇంకా ఉత్తర్వులు విడుదల కాలేదన్నారు. ఈ ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్ పరిధిలో చేరిస్తే నిష్ణాతులైన 18 మంది డాక్టర్లు, పూర్తి స్థాయిలో సిబ్బందిని ఉంటారని, ప్రస్తుతం కేవలం ముగ్గురు, నలుగురు డాక్టర్లతోనే కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజారోగ్య రక్షణకు ప్రాధాన్యం

దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

- ఇందిరమ్మ ఇళ్లలో రిజర్వేషన్ కూడా..
- కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడి
- ఘనంగా ప్రజాపాలన, దివ్యాంగుల దినోత్సవం

మెదక్ మున్సిపాలిటీ: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతమిస్తోందని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు 50 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో ప్రజాపాలన.. ప్రజా విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం మెదక్ మున్సిపాలిటీలో శానిటేషన్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షల్లో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్ బ్లడ్ శాంపిల్‌తో టెస్ట్ చేయించుకున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నవీన్, మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.



మెదక్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

దివ్యాంగులకు ప్రత్యేకంగా ప్రజావాణి

మెదక్‌జోన్: దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహకం అందిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టేడియంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జిల్లాలో కొనసాగుతోందని, రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో వారి కున్న రిజర్వేషన్ ప్రకారం ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ దివ్యాంగులకు సమాన న్యాయం సమాన అవకాశాలు కల్పించిందని దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఆధ్వర్యంలో పలు క్రీడా పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారికి కలెక్టర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి దేవయ్య, ఉపాధ్యక్షుడు నజీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఈజీఎస్ సిబ్బందిని అభినందన

చిన్నశంకరంపేట(మెదక్): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా దివ్యాంగులకు అత్యధిక పని దినాలను కల్పించిన చిన్నశంకరంపేట ఈజీఎస్ ఏపీఓ రాజ్‌కుమార్‌తోపాటు సిబ్బందిని కలెక్టర రాహుల్ రాజ్ అభినందించారు. ఈజీఎస్ టీఏ సంపత్, కంప్యూటర్ ఆపరేటర్ స్వప్న, సూరారం ఫిల్డ్ అసిస్టెంట్ రామకృష్ణా రెడ్డి, కార్యదర్శ నాంపల్లిలను కలెక్టర్ సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

నాణ్యతలేని బియ్యాన్ని తిప్పి పంపండి

- విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న
- పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

కొడిపల్లి(నర్సాపూర్)/మనోహరాబాద్(తూప్రాన్)/చేగుంట(తూప్రాన్)/తూప్రాన్: నాణ్యతలేని బియ్యం వస్తే వాటిని తిప్పి పంపంచి మంచి బియ్యాన్ని రప్పించుకోవాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న సూచించారు. కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డీఈఓ రాధాకిషన్‌తో కలిసి కొడిపల్లి మండలం తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల, కొడిపల్లి ఉన్నత పాఠశాల, కొట్టాల ప్రాథమిక పాఠశాలలను, మనోహరాబాద్ మండలం కూచారం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. అదే విధంగా చేగుంట గిరిజన స్పోర్ట్స్ గురుకుల పాఠశాలను, తూప్రాన్ మండలంలోని అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాల, దతార్‌పల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల పరిసరాలు, వంటశాల, వంట సామగ్రిని పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేసి, ఉపాధ్యాయులు, వంట కార్మికులకు కొన్ని సూచనలు చేశారు. విద్యార్థులతో ముచ్చటించి బోధన, భోజనం, ఇతర సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాణ్యమైన సరుకులనే వాడాలని, విద్యార్థులకు వేడివేడి ఆహారం మాత్రమే వడ్డించేలా చూడాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ మల్లేశం, ఎస్ఓ గౌతమి తదితరులు పాల్గొన్నారు.



కొడిపల్లి మండలం తేనికిలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న జ్యోత్స్న

జిల్లాను అగ్రగామిగా నిలపాలి

క్రీడాకారులకు అదనపు కలెక్టర్ నగేశ్ పిలుపు

మెదక్ కలెక్టరేట్: సీఎం కప్ పోటీల్లో జిల్లాను అగ్రగామిగా నిలపాలని అదనపు కలెక్టర్ నగేశ్ క్రీడాకారులకు సూచించారు. మంగళవారం ప్రజాపాలనా ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి రాందాస్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రపాల్‌తో కలిసి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 7 నుంచి 21వ తేదీ వరకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో వివిధ క్రీడా అంశాల్లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయితోపాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి దామోదర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ పాల్గొన్నారు.



2కే రన్‌లో అదనపు కలెక్టర్ నగేశ్, అధికారులు

స్వచ్ఛ మునిసిపాలిటీ కోసం కృషి

మునిసిపల్ కమిషనర్ దేవేందర్

రామాయంపేట(మెదక్): స్వచ్ఛ మున్సిపాలిటీ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 4వ తేదీ నుంచి ఆరో తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కమిషనర్ సహా పారిశుద్ధ్య కార్మికులను డాక్టర్లు పరీక్షించి వైద్యసేవలు అందజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అంతకుముందు పట్టణంలో మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపు వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. నాలుగు ఇందిరా మహిళా శక్తి యూనిట్లను కమిషనర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేమె యాదగిరి, సుందర్‌సింగ్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్మన్ జితేందర్‌గౌడ్

నూతన పీఆర్‌సీని అమలు చేయాలి

టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రణీద్‌కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ రాష్ట్ర రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించి, అమలు చేయాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వెల్దుర్తి మండలంలో సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు కూడా భాగస్వాములేనని, వారి భాగస్వామ్యంతోనే విజయం సాధిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. 317 జీఓ మేరకు స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు అందరికి స్థానిక జిల్లాలకు పంపించే విధంగా ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వెల్దుర్తి మండల అధ్యక్షుడు పరశరాం, ప్రధాన కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కమీషన్‌ పేరుతో మోసం

రూ.1.75 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్‌: కమీషన్‌ పేరుతో నగదు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూలై 15వ తేదీన నగదు ఇన్వెస్ట్‌ చేస్తే కమీషన్‌ ఇస్తామంటూ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్‌ కాల్‌ వచ్చింది. దీనికి స్పందించిన ఉద్యోగి పలు దఫాలుగా అపరిచిత వ్యక్తికి రూ.1.75 లక్షలు వేశాడు. ఇంకా నగదు వేయాలని అపరిచిత వ్యకి పదే పదే అడగడంతో అనుమానం వచ్చిన ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్‌ ఇవ్వాలని అడిగాడు. దీంతో అతడు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు, మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లీ, కుమారుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: తల్లీ, కుమారుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్‌ రావు కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కి చెందిన గౌస్‌ సోదరి నసీమా బేగం, ఆమె కుమారుడు జునైద్‌ (11) గత నెల 29న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. నసీమా భర్త చనిపోవడంతో నాలుగేళ్లుగా సోదరుడి ఇంటి పక్కనే నివాసం ఉంటుంది. ఈ క్రమంలో గౌస్‌ ఇద్దరి కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం నస్తిపూర్‌ గ్రామ శివారులో 1వ తేదీన దారుణ హత్యకు గురైన మహిళ ఆచూకీ లభ్యమైంది. హత్నూర ఎస్సై సుభాష్‌ మంగళవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేపట్టగా మృతురాలు పుల్కల్‌ మండలం బస్వాపూర్‌ గ్రామానికి చెందిన గొల్ల లలిత (50) భర్త లింగమయ్యగా గుర్తించాం. మృతురాలు ఇంటి నుంచి బయలుదేరి సంగారెడ్డి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు తెలిసిందని, హత్యకు గల కారణాలను తెలుసుకొని నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్తి తగాదాలే కారణం అన్నట్లుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుర్‌కురే ప్యాకెట్లు సీజ్‌



సీజ్‌ చేసిన వాటిని చూపుతున్న అధికారులు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): తెలంగాణ రాష్ట్ర ఫుడ్‌ సేఫ్టీ కమిషనర్‌ ఆదేశాలతో ఫుడ్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు మండలంలోని కాళ్లకల్‌ పరిశ్రమల వాడలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్‌ హెడ్‌ అధికారి, జోనల్‌ అసిస్టెంట్‌ ఫుడ్‌ కంట్రోలర్‌ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో కాళ్లకల్‌లోని సన్ని ఫుడ్స్‌ మాన్యుఫాక్చర్‌ యూనిట్‌లో ఈ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా నాణ్యత లేని కుర్‌కురే ప్యాకెట్లు, మసాల ప్యాకెట్లు తయారీని గుర్తించారు. లైసెన్స్‌ లేకుండా తయారీ చేయడం, స్టోరేజ్‌, విక్రయ యూనిట్‌లను నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో ప్యాక్‌ చేసిన వాటిని సీజ్‌ చేసి, నోటీసులను అందించామని, వాటి విలువ రూ.2,13,250 ఉంటుందని తెలిపారు. సీజ్‌ చేసిన ఆహార నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, శ్రీషిక ఉన్నారు.

గట్టు.. మిగిలితే ఒట్టు

మాయమైపోతున్న గౌరవెల్లి ప్రాజెక్ట్‌ కాల్వ గట్లు

- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- నిత్యం టిప్పర్లలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- కాల్వ హద్దులు తొలగడంతో అక్రమణకు గురవుతున్న భూమి
- పట్టించుకోని పలు శాఖల అధికారులు



రాంచంద్రపూర్‌ శివారులో నేలకు సమాంతరంగా కాల్వ గట్టు

గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్‌ గట్టు రోజురోజుకూ తరిగిపోతోంది. కాల్వ తవ్వకం జరిగినప్పుడు ఇరువైపులా మట్టి గుట్టలను తలపించేది. కానీ నేడు నేలకు సమాంతరంగా అయ్యింది. గోరంత అనుమతి తీసుకొని కొండంత తవ్వేస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పేరుతో వందలాది టిప్పర్లలో మట్టిని తరలించేస్తున్నారు. ప్రాజెక్టు కెనాల్‌ తవ్వకం ప్రారంభం నాటి నుంచి ఈ మట్టి అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వం మారిన, మనుషులు మారిన మట్టి తవ్వకాలు ఏ మాత్రం ఆగడం లేదు. అధికారులు సైతం చూసిచూడనట్లుగా ఉండటంతో కాల్వ గట్టు కనుమరుగవుతూ వస్తోంది.

– కోహెడరూరల్‌(హుస్నాబాద్‌)

బెజ్జంకి మండలం తోటపల్లి చెరువు నుంచి హుస్నాబాద్‌ గౌరవెల్లి ప్రాజెక్టుకి నీటిని మళ్లించేందుకు కోహెడ మండలం రాంచంద్రపూర్‌, చిగురుమామిడి మండలం ఓగులాపూర్‌ మీదుగా సుమారు 8 కిలో మీటర్ల మేర కాల్వను తీశారు. తవ్వాకల్లో వచ్చిన మట్టిని కాల్వకు రెండు వైపులా 50 అడుగుల ఎత్తులో పోశారు. ఈ మట్టిపై కన్నుపడ్డ అక్రమార్కులు, కాంట్రాక్టర్లు ఇష్టారీతిన తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారు.

రోడ్డు విస్తరణ పేరుతో..

కెనాల్‌కు ఇరువైపులా ఉన్న మట్టితో ప్రభుత్వానికి భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారుల లోపంతో గండి పడుతుంది. ఇరిగేషన్‌ అధికారులు ఇష్టారాజ్యాంగ అనుమతులు ఇవ్వడంతో కాల్వ చుట్టూ ఎత్తైన గుట్టలుగా ఉన్న మట్టి సంగానికి పైగా మాయం అయ్యింది. ఇటీవల కోహెడ మండలంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ నిర్మాణ పనులకు ఇక్కడి నుంచే మట్టి తీసుకెళ్లడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో తీసుకున్న దానికంటే అధికంగా మట్టిని తవ్వి హద్దులు లేకుండా చేస్తున్నారు.

అనుమతి లేకుంటే చర్యలు

గౌరవెల్లి ప్రాజెక్ట్‌ కెనాల్‌ కాల్వకు సంబంధించిన మట్టిని రోడ్డు విస్తరణకు తరలించేందుకు 15 రోజులు మాత్రమే అనుమతి ఇచ్చాం అంతకు మించి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అలాగే, కెనాల్‌ వెంట హద్దులు ఏర్పాటు చేయలేదు. ఇందుకోసం ప్రభుత్వానికి నివేదించాం. అనుమతి రాగానే ఏర్పాటు చేస్తాం. కెనాల్‌కి సంబంధించిన భూమిని చుట్టుపక్కల రైతులు ఆక్రమించొద్దు.

– అజీజ్‌, ఇరిగేషన్‌ జేఈ

అనుమతులు ఉన్నాయంటూ..

కెనాల్‌ నుంచి తవ్విన మట్టిని మరో ప్రాంతానికి తరలించాలంటే కచ్చితంగా ఇరిగేషన్‌, మైనింగ్‌ శాఖల అనుమతులు తప్పనిసరి. వేల క్యూబిక్‌ మీటర్ల మట్టిని తవ్వకాలకు ఇరిగేషన్‌ శాఖ నుంచి 15 రోజులకు గాను 5 వేల క్యూబిక్‌ సెక్‌ల అనుమతులు పొందారు. కానీ మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు పొందకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. ఇదేంటని స్థానికులు ప్రశ్నిస్తే మాకు అనుమతులు ఉన్నాయంటూ తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో ఈ దందాకు పాల్పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు.



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

మాదంటే మాది కాదు

నిబంధనల ప్రకారం ఈ కెనాల్‌ మట్టిని తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్‌ అధికారులకు, ఇరిగేషన్‌ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఇది కెనాల్‌ మట్టి కాబట్టి ఇరిగేషన్‌ శాఖ అధీనంలో ఉండటంతో పరివేక్షణ లోపంతో అక్రమార్కులకు వరంలా మారింది. మట్టి తరలింపుపై ఫిర్యాదు చేసినా ఆయా శాఖల నుంచి ఎలాంటి స్పందన లేకపోగా మా పరిధిలోకి రాదంటూ దాటవేస్తున్నారు. ఏది ఏమైనా అధికారుల సమన్వయ లోపంతో రూ.లక్షలు విలువ చేసే మట్టిని పక్కదారి పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకొని మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రించాలని కోరుతున్నారు.

స్కూల్‌ నుంచి బాబును తీసుకొస్తుండగా..

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

పటాన్‌చెరు టౌన్‌: మహిళ మెడలో నుంచి గొలుసు దొంగలించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఎన్‌ఆర్‌ఐ కాలనీకి చెందిన గొల్ల భాగ్యమ్మ మంగళవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న ప్రైవేట్‌ స్కూల్‌కి వెళ్లి కుమారుడు నవనీత్‌ని తీసుకొని ఇంటికి వెళ్తుంది. మార్గమధ్యలో వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని పుస్తెలతాడు తెంపుకొని పరారయ్యాడు. బాధితురాలు భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో..

రామాయంపేట(మెదక్‌): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని బాపనయ్య మోతుకుల తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తండాకు చెందిన దుర్గొగ్య హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడికి రోడ్డు ప్రమాదం జరిగిందని రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఇంటికి రాగా తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచి ఉంచిన బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడు దుర్గొగ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయికి సైన్స్‌ ప్రదర్శనలు

విద్యార్థులకు అభినందనలు

నర్సాపూర్‌: రాష్ట్ర స్థాయి సైన్స్‌ ఫెయిర్‌ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పట్టణంలోని శ్రీ విష్ణు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్‌ జామి మంగళవారం తెలిపారు. ఇటీవల మెదక్‌లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ ఫెయిర్‌ పోటీల్లో తమ పాఠశాలలో 8వ తరగతి చదివే యశశ్రీ, శ్రీచంద్ర అగ్ని పర్వత విస్ఫోటనం అనే అంశంపై ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకొని రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్‌ ప్రిన్సిపాల్‌ విశ్వనాథ్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

టేక్మాల్‌(మెదక్‌): రాష్ట్ర స్థాయి సైన్స్‌ ఫెయిర్‌కు టేక్మాల్‌ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్‌ మంగళవారం తెలిపారు. పాఠశాలలో 10వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీలు ఐశ్వర్య, రేణుక అంతరించిపోతున్న జీవరాశుల రక్షణ అనే అంశంపై ప్రదర్శనను ఏర్పాటు చేసి ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు సైన్స్‌ టీచర్‌ ఉమా మహేశ్వరరాజ్‌ను పాఠశాల తరఫున అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌ బాలమణి ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు

ప్రతీ రైతు సేంద్రియ సాగు చేయాలి

- కేవీకే శాస్త్రవేత్త దత్తాత్రేయ నల్కర్‌
- రైతులకు వరి విత్తనాలు, నారు మడులు పంపిణీ



కేవీకేలో రైతులకు వేప నూనె పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని కేవీకే హెడ్‌ అండ్‌ సైంటిస్ట్‌ శంబాజీ దత్తాత్రేయ నల్కర్‌ సూచించారు. మంగళవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్‌ డీ.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్‌ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో షెడ్యూల్‌ కులాల ఉప ప్రణాళిక ఇన్‌చార్జి, ఉద్యానవన శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో పోతిరెడిపల్లి గ్రామ ఎస్సీ రైతులకు 20 కిలోల వరి విత్తనాలు, జీవన ఎరువులు, వేపనూనె, టమాట, మిరప కూరగాయల నారు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ నల్కర్‌ మాట్లాడుతూ.. ప్రతీ రైతు కనీసం ఇంటి అవసరాల కోసమైనా సేంద్రియ సాగు చేయాలని సూచించారు. ఎస్సీ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేవీకే ఆధ్వర్యంలో సేంద్రియ, పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌, భార్గవి, వినాయక సేంద్రియ సహకారం సంఘం చైర్మన్‌ ప్రభాకర్‌ గౌడ్‌, రైతులు పాల్గొన్నారు.

జనవరి 11న బాడీ బిల్డింగ్‌ పోటీలు

సిద్దిపేటజోన్‌: జిల్లా బాడీ బిల్డింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జనవరి 11న జిల్లా కేంద్రంలో బాడీ బిల్డింగ్‌ పోటీలు, ఎంపికలు ఉంటాయని అసోసియేషన్‌ అధ్యక్షుడు కొండం సంపత్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక విపంచి ఆడిటోరియంలో వచ్చే ఏడాది జనవరి 11 (శనివారం)న సాయంత్రం 6 గంటలకు బాడీ బిల్డింగ్‌ పోటీలు నిర్వహించి మిస్టర్‌ సిద్దిపేట కోసం ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. 50 నుంచి 55 కిలోలు, 55 నుంచి 60, 60 నుంచి 65, 65 నుంచి 70, అదే విధంగా 80 నుంచి 85 కిలోల బరువు కేటగిరీలుగా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ఉంటాయని, అనంతరం మిస్టర్‌ సిద్దిపేట ట్రోఫీ గెలిచిన వారికి నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ కార్యదర్శి వెంకట్‌ స్వామి, బాడీ బిల్డింగ్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు సత్యం గౌడ్‌, సిద్దులు, శేఖర్‌, సాఖత్‌, అఫ్సర్‌, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే లైన్‌ విద్యుద్దీకరణ పనులు

రైల్వే డీఆర్‌ఎం లోకేష్‌ విష్ణోయ్‌



అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో లోకేష్‌ విష్ణోయ్‌

రామాయంపేట(మెదక్‌): మండల పరిధిలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్‌ను మంగళవారం దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం లోకేష్‌ విష్ణోయ్‌ పరిశీలించారు. స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్‌ నుంచి ముత్కేడ్‌ వరకు 221 కిలో మీటర్ల మేర రైల్వే లైను విద్యుద్దీకరణకు రూ.2,300 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులు కొనసాగుతున్నాయని తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అక్కన్నపేట-మెదక్‌, మనోహరాబాద్‌- కొత్తపల్లి లైనులో విద్యుద్దీకరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అక్కన్నపేట స్టేషన్‌లో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తామని డీఆర్‌ఎం హామీ ఇచ్చారు. ఆయన వెంట డీసీఎం అనురుధ్‌, డీఎస్‌వో విజయకుమార్‌, డీఈఈ విష్ణు చైతన్య, ఇతర అధికారులు ఉన్నారు.

బిల్లులు ఇస్తారా? ఆత్మహత్య చేసుకోమంటారా?

బాలికల పాఠశాలకు తాళం వేసిన ఎస్‌ఎంసీ చైర్మన్లు



ధర్నా చేస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్లు

మెదక్‌ మున్సిపాలిటీ: అప్పులు చేసి పాఠశాలల నిర్మాణాలు చేస్తే బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తుందని, బిల్లులు మంజూరు చేయకుంటే మాకు ఆత్మహత్యే గతని ఎస్‌ఎంసీ చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మన ఊరు-మనబడి బిల్లుల కోసం మెదక్‌ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు తాళం వేసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఊరు-మన బడి పథకంలో పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని మండి పడ్డారు. వందలసార్లు కలెక్టర్లకు, డీఈఓకు వినతులు అందజేసినప్పటికీ బిల్లులు మాత్రం మంజూరు చేయడం లేదన్నారు. మేము నిర్మించిన పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో రంగులు వేయించి వారికి డబ్బులు ఇస్తున్నారని వాపోయారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి నిర్మాణాలు చేస్తే మాకు బిల్లులు ఇవ్వకుండా క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళం వేయడంతో విద్యార్థులంతా రోడ్డుపైన నిలబడిపోయారు. పాఠశాల హెచ్‌ఎం రేఖ విషయాన్ని ఎంఈఓ నీలకంఠం తెలుపగా అక్కడికి చేరుకొని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని వారిని సముదాయించి ధర్నా విరమింపజేశారు. అనంతరం పాఠశాలకు తాళం తీశారు.

బిహార్‌ టు చిన్నశంకరంపేట

- భారీగా గంజాయి తీసుకొచ్చి విక్రయం
- నిందితుడిని అరెస్ట్‌ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరాజంగౌడ్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): గంజాయి విక్రేతను పోలీసులు పట్టుకున్న ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం చిన్నశంకరంపేటలో రామాయంపేట సీఐ వెంకట రాజంగౌడ్‌ వివరాలు వెల్లడించారు. బిహార్‌ రాష్ట్రంలోని చాప్రా సారన్‌ జిల్లా భగవాన్‌ పూర్‌ గ్రామానికి చెందిన సూరజ్‌ కుమార్‌ స్థానిక రాధా స్టీల్‌ పరిశ్రమలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. చిన్నశంకరంపేటలో నివాసం ఉంటూ గంజాయికి అలవాటు పడిన సూరజ్‌ అక్టోబర్‌లో బిహార్‌ నుంచి ఒకేసారి పెద్ద మొత్తంలో ఇక్కడికి తీసుకొచ్చాడు. సిగరేట్‌లో గంజాయిని నింపుకొని సేవించడంతోపాటు తోటి కార్మికులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని పద్మనాభస్వామి గుట్ట సమీపంలోని మీర్జాపల్లి ఎక్స్‌ రోడ్‌ వద్ద బ్యాగులో గంజాయితో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పేట ఎస్‌ఐ నారాయణగౌడ్‌ తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. బ్యాగులో 512 గ్రాములు ఉన్నట్లు గుర్తించి వెంటనే సూరజ్‌ను అదుపులోకి తీసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చేగుంట ఎస్‌ఐ చైతన్యరెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్కూల్‌ బస్సు, ఆటో ఢీ

డ్రైవర్‌, విద్యార్థులకు స్వల్పగాయాలు

పాపన్నపేట(మెదక్‌): స్కూల్‌ బస్సు, ఆటో ఢీకొన్న ఘటన పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌ బ్రిడ్జిపై మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సంగన్న కథనం మేరకు.. మెదక్‌ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్‌ స్కూల్‌ బస్సు విద్యార్థులను తీసుకొని పాపన్నపేట వైపు వస్తుంది. ఈ క్రమంలో ఎల్లాపూర్‌ వైపు నుంచి మెదక్‌ వెళ్తున్న సిమెంట్‌ ఆటో ఎల్లాపూర్‌ బ్రిడ్జిపైకి రాగానే టైర్‌ పగలడంతో కుడివైపు వెళ్లి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తుమ్మలపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌ ఎల్లన్నోళ్ల సాయిలుకు గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సులో సుమారు 50 మందికి పైగా పిల్లలుండగా ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పాపన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

సెల్‌ టవర్‌ల బ్యాటరీలు చోరీ

ఆరుగురు నిందితులు అరెస్టు



బ్యాటరీలు చూపుతున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్‌: సెల్‌ టవర్‌ల బ్యాటరీలు చోరీకి పాల్పడుతున్న నిందితులను పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌-మల్కాజ్‌గిరి జిల్లా లాల్‌గాడి మలకోపేట్‌కు చెందిన బదావత్‌ కృష్ణ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని రాడగంబ బస్తీలో నివాసముంటున్నాడు. అతడి కుమారుడు (మైనర్‌)తోపాటు మంచిర్యాల జిల్లా కిష్టంపేటలోని ఎల్లక్కపేటకు చెందిన సతీష్‌, నస్పూర్‌లోని ఆర్‌కే 5కాలనీకి చెందిన ఇస్లావత్‌ రమేష్‌, బెల్లంపల్లిలోని రడగంబ బస్తీకి చెందిన లావుడియా శంకర్‌లు పని కోసం మేడ్చజ్‌-మల్కాజ్‌గిరి జిల్లాలో ఉంటున్నారు. గతంలో సెల్‌ టవర్‌లకు బ్యాటరీలను ట్రాన్స్‌పోర్ట్‌ చేయగా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో వీరంతా బృందాలుగా ఏర్పడ్డారు. గజ్వేల్‌, కుకునూర్‌పల్లి, ములుగు, మనోహరాబాద్‌, షామీర్‌పేట్‌, శివ్వంపేట, శంషాబాద్‌, చేగుంట పోలీస్‌ స్టేషన్ల పరిధిలో సెల్‌ టవర్‌ల బ్యాటరీలను చోరీ చేసి మేడ్చల్‌ జిల్లా కిష్టాపూర్‌ ప్రాంతానికి చెందిన దుద్దెడ లింగం స్క్రాప్‌ దుకాణంలో విక్రయిస్తున్నారు. సెల్‌ టవర్‌ బ్యాటరీలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు అందుకున్న గజ్వేల్‌ పోలీసులు టెక్నాలజీ సాయంతో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 98 వేల నగదుతో పాటు 23 బ్యాటరీలు, 4 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ 11 కేసుల్లో జ్యుడిషియల్‌ రిమాండ్‌కు పంపించినట్లు గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ అనురాధ అభినందించారు.

పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తుండగా..

- డివైడర్‌, లారీని ఢీకొట్టిన కారు
- వ్యక్తి మృతి, ఇద్దరికి గాయాలు

జహీరాబాద్‌ టౌన్‌: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కోహీర్‌ మండల పరిధిలో గల చింతల్‌ఘాట్‌ గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌ కుమార్‌ కథనం మేరకు.. పటాన్‌చెరుకు చెందిన సామ అశోక్‌ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఇద్దరు మిత్రులతో కలిసి కోహీర్‌ మండలంలోని వెంకటాపూర్‌ గ్రామానికి కారులో వచ్చాడు. వేడుకల ముగిశాక తిరుగు ప్రయాణంలో పటాన్‌చెరుకు వెళ్తున్నారు. చింతల్‌ఘాట్‌ గ్రామ పరిధిలో 65 జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని అనంతరం లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్‌ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం జహీరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



జహీరాబాద్‌ టౌన్‌: ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బైక్‌ అదుపుతప్పి..

సంగారెడ్డి క్రైమ్‌: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్‌ కథనం మేరకు.. నర్సాపూర్‌ మండలం సీత్యాతండాకు చెందిన ముడతల దేవిసింగ్‌ (35) మంగళవారం ఉదయం పోతిరెడ్డిపల్లి నుంచి బైక్‌పై సంగారెడ్డికి వస్తున్నాడు. సంగారెడ్డిలోని సీఎస్‌ఐ చర్చ్‌ ఆవరణలోకి రాగానే బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సు ఢీకొని వ్యక్తి..

చిన్నశంకరంపేట(మెదక్‌): బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండలం వల్లూర్‌ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వల్లూర్‌ గ్రామానికి చెందిన వడ్ల రమేష్‌(45) చేగుంటకు వెళ్లి సైకిల్‌పై గ్రామానికి తిరిగొస్తున్నాడు. వల్లూర్‌ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా నిజామాబాద్‌ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రమేష్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ అహ్మద్‌ మోహినొద్దీన్‌ తెలిపారు.